క్లుప్తంగా

మాలి సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక



స్వీటు తినిపిస్తున్న మాలి సంఘం నాయకులు

కెరమెరి: మాలి సంక్షేమ సంఘం మండల కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోట్రంగే తిరుపతి, ఉపాధ్యక్షుడిగా మొహర్లే నగేశ్, సభ్యులుగా మొహర్లే శ్రీధర్, మందాడే శివరాం, కోట్రంగే పోషట్టి, సొనూలా సోము, మాండోరే బాజీరావు, గావెత్రే శంకర్, ఆదే ముకుంద్‌రావు, ఎం.దీ వాంజి, కొట్రంగే చందు, చత్రే దత్తు, మొహర్లే సుభాశ్, మాండోరే బాజిరావు, కోట్రంగే హన్మంతు, ఆదే శంకర్ ఎన్నికయ్యారు. అనంతరం సభ్యులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వాడే సోనేరావు, సకారాం, నారాయణ, శంకర్ హన్మంతు, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని వినతి

తిర్యాణి: మండలంలోని పంగిడిమాదరలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు బుధవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీహెచ్‌సీ అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. దీంతో పాటు చింతలమాదర జలపాతం వద్ద నిర్మించిన బాత్ రూంలకు నీటి సరఫరా అయ్యేలా చూడాలని, జలపాత ఎంట్రన్స్ గేటు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు.

వ్యాసరచన పోటీలు

కెరమెరి: మండలంలోని గోయగాం, ఝరి ఉన్నత పాఠశాలలు మోడిలోని కేజీబీవీలో విద్యార్థులకు బుధవారం పోలీసుల ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'మందుల అధిక వినియోగ బానిసత్వాన్ని ఛేదించు, ఒక తప్పుడు నిర్ణయం జీవితం మొత్తాన్ని మార్చేస్తుంది' అనే టాపిక్స్‌పై ఈ పోటీలను నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మధుకర్, ఎంఈవో ఆడే ప్రకాశ్, హెచ్‌ఎం భరత్‌రావు, ఎస్‌వో ప్రవీనా, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శత చండీయాగం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కేశవనాథ ఆలయ ప్రాంగణంలో బుధవారం శత చండీ రుద్ర సహిత యాగం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూడు రోజులుగా వేద పండితులు రవీంద్ర శర్మ, శివరామ శర్మ, ఉపేంద్ర శర్మ, మదుసూదన్ శర్మ, రాఘవేంద్రాచారి ఆధ్వర్యంలో హోమం కొనసాగుతుండగా, బుధవారం పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. నిర్వాహకులు శ్రీనివాసశర్మ, భక్తులు పాల్గొన్నారు.

కోతులతో పరేషాన్

కాగజ్‌నగర్ టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ద్వారకానగర్, కౌసర్‌నగర్ కాలనీల్లో గత వారం రోజులుగా గుంపులు గుంపులుగా కోతులు బీభత్సం సృష్టిస్తున్నారు. దీంతో కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు. ఉదయం, సాయంత్రం ఇంటిపైకి ఎక్కి, నానా హంగామా చేస్తున్నాయి. ఇంట్లోకి ప్రవేశించి చిందరవందర పాడేస్తున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు వాటిని తరలించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

108లో ప్రసవం

వాంకిడి: మండలంలోని ఇందాని గ్రామానికి చెందిన అనితకు మంగళవారం రాత్రి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. గ్రామానికి చేరుకున్న ఈఎంటి ఎనగంటి ప్రవీణ్, పైలట్ సాయి మహిళను వాంకిడి ఆసుపత్రికి తరలించే క్రమంలో పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. 108 సిబ్బంది వాహనాన్ని రోడ్డుపక్కన ఆపి ప్రసవం జరిపించారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారని, వాంకిడి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించినట్లు సిబ్బంది పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిర్పూర్(టి): తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల సిర్పూర్(టి), ఆసిఫాబాద్ ఖాళీగా ఉన్న ఇంగ్లిష్ పోస్టుకు పీజీటీ పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని డీసీవో శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 28న డెమోకు హాజరు కావాలని కోరారు. వివరాలకు 88073 58827 సంప్రదించాలని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

కౌటాల: మండలానికి చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఎంఈవో హన్మంతు ఒక ప్రకటనలో తెలిపారు. హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్ క్రీడా పాఠశాలల్లో ప్రవేశం కోసం బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ చూపారని పేర్కొన్నారు. బాలుర విభాగంలో ఆదే యశ్వంత్, టాకిరే విష్ణు, సాయి హర్షిత్, జాడి చరిత్, సమర్థ్ గుప్తా, ఎ.తరుణ్ సాత్విన్, బాలికల విభాగంలో పి.శ్రీజ, జె.కారుణ్య, ఆర్.శారోబ్, ఎస్.వైష్ణవి, మొర్లె అక్షిత ఎంపిక కాగా, జూలై 1న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

రోడ్డుపై గుంత.. ప్రజల చింత



చిత్రామ గూడెం మధ్యన బురదగా రోడ్డు

చింతలమానెపల్లి మండలంలోని ఖర్జెల్లి నుంచి గూడెం వరకు సుమారు 18 కిలోమీటర్ల దట్టమైన అటవీ ప్రాంతం ఉంది. ఈ రహదారి చింతలమానెపల్లి నుంచి మహారాష్ట్రలోని అహేరికి వెళ్లే మార్గంలో ఉండగా ప్రాణహిత నదిపై వంతెన కూడా పూర్తయ్యింది. ఈ రహదారి మలుపులు, చెట్లతో ప్రమాదకరంగా ఉంది. డబ్బా గ్రామంలోని కొత్తగూడెం క్రాస్‌రోడ్ నుంచి బాబాసాగర్ గ్రామం వరకు ఈ రహదారిపై పెద్ద గుంతలు పడ్డాయి. ఇటీవల బాబాసాగర్ నుంచి ఖర్జెల్లి వరకు రహదారికి మరమ్మతులు నిర్వహించారు. ఖర్జెల్లి నుంచి గూడెం వరకు రహదారి పలుచోట్ల కోతకు గురికాగా, చాలావరకు భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఖర్జెల్లి నుంచి గూడెం వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రహదారిపై భారీ వాహనాలకు అనుమతులు లేకున్నా నిత్యం పదుల సంఖ్యలో భారీ వాహనాలు కంకర తరలిస్తున్నాయి. దీంతో రోడ్డు అధ్వానంగా మారుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతులు నిర్వహించాలని కోరుతున్నారు.

– చింతలమానెపల్లి



బాబాసాగర్ సమీపంలో గుంతలుగా మారిన రహదారి



ఖర్జెల్లి సమీపంలో కోతకు గురవుతున్న రహదారి



కేతిని సమీపంలో గుంతలు

నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి అందరి బాధ్యత



మాట్లాడుతున్న ప్రాజెక్టు అధికారి నరేందర్

రెబ్బెన: నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి ఉద్యోగులందరి బాధ్యత అని కై రిగూడ ఓసీపీ ప్రాజెక్టు అధికారి మచ్చగిరి నరేందర్ అన్నారు. ఓసీపీలో బొగ్గు నాణ్యతపై బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. కోల్ బెంచీలపై షేల్ వేరుచేసే ప్రక్రియ నిరంతరం కొనసాగించాలని, నాణ్యతతో కూడిన బొగ్గు ఉత్పత్తి, రవాణా చేసినప్పుడే మార్కెట్‌లో సంస్థకు గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ జె.శంకర్, ప్రాజెక్టు ఇంజినీర్ వీరన్న, సేఫ్టీ అధికారి గౌతమ్ రాజేశ్‌రెడ్డి, ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవానికి ఏర్పాట్లు చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రవీణ్ కుమార్

వాంకిడి: వనమహోత్సవానికి ఏర్పాట్లు చేయాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే ప్రదేశాలను గుర్తించి ప్రణాళిక తయారు చేసుకోవాలని సూచించారు. రైతులకు అవసరమైన నీలగిరి మొక్కలను ఎస్‌పీఎమ్ వారి ద్వారా అందించడం జరుగుతుందన్నారు. అలాగే వెదురు మొక్కలను అటవీశాఖ నుంచి అందించనున్నట్లు తెలిపారు. పండ్ల మొక్కలు కావాల్సిన రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమావేశంలో ఏపీవో శ్రావణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సన్మానం



సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

కాగజ్‌నగర్ టౌన్: 1975 ఎమర్జెన్సీ సమయంలో కుమురం భీం జిల్లా నుంచి జైలుకు వెళ్లిన వారిని ఎమర్జెన్సీ వ్యతిరేఖ దినోత్సవం సందర్భంగా బీజేపీ నాయకులు బుధవారం శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధి ఎమర్జెన్సీ విధించి నేటికి 50 సంవత్సరాలు గడిచిందన్నారు. ఎమర్జెన్సీ వ్యతిరేక దినం సందర్భంగా జైలుకు వెళ్లిన ఇందూరి వెంకటేశం, ఎరబోతుల శంకర్‌లను సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొత్తపల్లి శ్రీనివాస్, ఠాకూర్ విజయ్‌సింగ్, సమీర్ గుప్త, అరుణ్ లోయ, వలపదాసు రమేశ్ పాల్గొన్నారు.

బోనాల జాతర విజయవంతం చేయాలి

రెబ్బెన: హైదరాబాద్‌లోని లోయర్ ట్యాంకుబండ్ వద్ద కనకాల కట్ట మైసమ్మకు కుమ్మరులు అందజేసే తొలిబోనం సందర్భంగా నిర్వహించే బోనాల జాతరకు జిల్లా లోని కుమ్మరులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కుమ్మర సంఘం జిల్లా అధ్యక్షుడు కుమ్మరి మల్లేష్ అన్నారు. బుధవారం గోలేటి ఎక్స్‌రోడ్ వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కటికనపెల్లి మొండి, కార్యదర్శి ఎర్ర మహేష్, సహాయ కార్యదర్శి సంతోష్, జిల్లా ఉపాధ్యక్షుడు విలాసాగర్, నగేష్, ఎర్ర తిరుపతి, యూత్ అధ్యక్షుడు మల్లేష్, తిరుపతి, మండల అధ్యక్షుడు రమేశ్ పాల్గొన్నారు.

జీఎంలకు సన్మానం

రెబ్బెన: సింగరేణి సంస్థలో సుదీర్ఘకాలం విధులు నిర్వహించి ఈ నెలలో పదవీ విరమణ పొందనున్న ఆర్‌అండ్‌డీ (రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్) ఆర్.నారాయణరావు, బెల్లంపల్లి రీజియన్ క్వాలిటీ జీఎం సుశాంత్‌సాహాలను బుధవారం ఏరియా జనరల్ మేనేజర్ విజయ భాస్కర్‌రెడ్డి అధికారులతో కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీవో నరేందర్, ఎస్వోటూజీఎం రాజమల్లు, సివిల్ డీజీఎం మదీనా బాషా, వర్క్‌షాప్ డీజీఎం కృష్ణమూర్తి, స్టోర్స్ డీజీఎం శ్రీనివాసరావు, మేనేజర్ శంకర్, ఫైనాన్స్ మేనేజర్ రవికుమార్, డీవైపీఎం రాజేశ్వర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

వాంకిడి: ఆసిఫాబాద్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి బుధవారం వాంకిడి మండలానికి చెందిన 27 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపించారు. పీఏసీఎస్ చైర్మన్ పెంటు, తహసీల్దార్ డి.కవిత పాల్గొన్నారు.

పరిష్కారమే మిగిలింది

- రెవెన్యూ సదస్సుల ద్వారా 920 దరఖాస్తులు
- భూ సమస్యలను పరిష్కరించే పనిలో రెవెన్యూ యంత్రాంగం

రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన దరఖాస్తుల వివరాలు

భూ సమస్య	వచ్చిన దరఖాస్తులు
మిస్సింగ్ సర్వే నంబర్	193
పెండింగ్ మ్యుటేషన్	44
డీఎస్ పెండింగ్	65
భూవిస్తీర్ణం కరెక్షన్	23
భూస్వభావం మార్పు	25
పీవోటీ	14
పీవోటీ, సాదాబైనామా, సివాజ్ జమ్మేదార్	487



రెవెన్యూ కార్యాలయం వద్ద నిరీక్షిస్తున్న రైతులు

రెబ్బెన: రైతులకు పంటల సాగుకంటే భూసమస్య పెద్ద కష్టంగా మారింది. భూసమస్యల పరిష్కారం కోసం గత ప్రభుత్వం వీఆర్వో వ్యవస్థను రద్దుచేసి ధరణిని తీసుకువచ్చింది. అప్పటి వరకు ఆఫ్‌లైన్‌లో ఉన్న భూముల రికార్డులన్నింటినీ ఆన్‌లైన్ చేసింది. ఆ సమయంలో రెవెన్యూ సిబ్బంది చేసిన తప్పిదాలు రైతుల పాలిట శాపంగా మారాయి. వాటిని పరిష్కరించుకునేందుకు రైతులు రెవెన్యూ కార్యాలయాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. సర్వే నంబర్ల మిస్సింగ్‌తో చాలామంది ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయానికి దూరమయ్యారు. ఎట్టకేలకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి స్థానంలో భూభారతి చట్టాన్ని తీసుకువచ్చింది. భూసమస్యల పరిష్కారం కోసం గ్రామాల్లో ఈనెల 20 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. ప్రస్తుతం వాటిని పరిష్కరించే పనిలో రెవెన్యూ అధికారులు నిమగ్నమయ్యారు.

కుప్పలు తెప్పలుగా ధరఖాస్తులు

భూముల వివరాలన్నింటినీ ఆన్‌లైన్ చేసే క్రమంలో సిబ్బంది చేసిన తప్పిదాల కారణంగా కొత్తకొత్త సమస్యలు పుట్టుకొచ్చాయి. అప్పటి వరకు రెవెన్యూ రికార్డుల్లో పట్టా భూమిగా ఉన్న భూమి ధరణిలోకి వచ్చేసరికి అసైన్డ్ భూములుగా, ఇనాం భూములుగా మారిపోయాయి. కొంతమంది రైతుల భూములు ప్రొహిబిటెడ్ జాబితాలో వచ్చిపడ్డాయి. కొందరి సర్వే నంబర్లే కనిపించకుండాపోయాయి. పాస్‌బుక్కుల్లో కులం, తండ్రి పేరు వంటి అనేక దోషాలు ఏర్పడ్డాయి.

మండలంలో 920 దరఖాస్తులు

మండలంలో అన్ని రెవెన్యూ గ్రామాల్లో ఈనెల 20 వరకు నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వివిధ రకాల భూసమస్యలకు పరిష్కారం కోరుతూ రైతుల నుంచి 920 దరఖాస్తులు వచ్చాయి. ప్రస్తుతం రెవెన్యూ సిబ్బంది వాటిని ఆన్‌లైన్ చేస్తున్నారు. ప్రక్రియ పూర్తయిన దరఖాస్తులకు సంబంధించి నోటీసులు అందించిన వారంలోగా రైతులు క్లెయిమ్ చేసుకోవాల్సి ఉంటుంది. అనంతరం రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లి భూ సమస్యను పరిష్కరిస్తారు. సర్వే నంబర్, పెండింగ్ మ్యూటేషన్, డిజిటల్ సిగ్నేచర్ పెండింగ్, భూ విస్తీర్ణంలో మార్పులు, భూస్వభావం మార్పు, కులం, తండ్రి పేర్ల మార్పు వంటి సమస్యలకు త్వరలోనే పరిష్కారం లభించనుంది. అయితే సాదాబైనామా, పీవోటీ, సివాజ్ జమేందార్ వంటి సమస్యల పరిష్కారానికి మరికొంత సమయం పట్టేలా ఉంది.

ఆన్‌లైన్‌కే పరిమితమైన సాదాబైనామా దరఖాస్తులు

గతంలో తెల్ల కాగితంపై రాసుకుని సాదాబైనామా పద్ధతిలో భూములను కొనుగోలు చేసుకున్న రైతులకు భూములు పట్టాలు కాకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. గత ప్రభుత్వం సాదాబైనామా భూములను క్రమబద్ధీకరించేందుకు రైతుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించింది. అయితే ధరణి చట్టంలో సాదాబైనామాలను పరిష్కరించేందుకు అవకాశం లేకుండా పోయింది. దాంతో దరఖాస్తులన్ని ఆన్‌లైన్‌కే పరిమితమయ్యాయి. అయితే తాజా ప్రభుత్వం తీసుకువచ్చిన భూ భారతి చట్టంతో సాదాబైనామాలను సైతం పరిష్కరించేలా వెసులుబాటు కల్పించింది. దీంతో ఎన్నో ఏళ్లుగా కేవలం మోఖాపై ఉండి భూములు సాగు చేసుకుంటున్న ఈ తరహా రైతులకు యాజమాన్యపు హక్కులు దక్కనున్నాయి.

నోటీసులు అందించే పనిలో ఉన్నాం



రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నాం. దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియతో పాటు నోటీసులు సిద్ధం చేసే పనులు సాగుతున్నాయి. క్షేత్రస్థాయికి వెళ్లి విచారించి భూ సమస్యలను పరిష్కరిస్తాం. పీవోటీ, సాదాబైనామా, సివాజ్ జమ్మేదార్ వంటి తరహా సమస్య పరిష్కారానికి కొంతసమయం పడుతుంది.

– సూర్య ప్రకాశ్, తహసీల్దార్, రెబ్బెన

సెల్‌ఫోన్ అప్పగింత



అప్పగిస్తున్న ఎస్సై

వాంకిడి: మండల కేంద్రానికి చెందిన అహ్మద్‌ఖాన్ ఇటీవల తన మొబైల్ ఫోన్ పోగొట్టుకోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సంబంధిత పోర్టల్ ద్వారా ట్రేస్‌చేసి ఫోన్‌ను స్వాధీనం చేసుకుని బుధవారం బాధితుడికి అప్పగించారు. ఈ సందర్భంగా కానిస్టేబుల్ నయీమ్‌ను ఎస్సై అభినందించారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: పెంచికల్‌పేట్ మండలం అగర్‌గూడ గ్రామానికి చెందిన రాజశేఖర్ మృతికి కారణమైన రాచకొండ కృష్ణ దంపతులను అరెస్టు చేసి, బాధిత కుటుంబానికి న్యా యం చేయాలని కాగజ్‌నగర్ డీఎస్పీ కార్యాలయంలో సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందించారు. సీపీఎం జిల్లా అధ్యక్షుడు కూశన రాజన్న మాట్లాడుతూ రాచకొండ కృష్ణ వేధింపులు తట్టుకోలేకనే రాజశేఖర్ ఆత్మహత్యకు పాల్ప డ్డాడని తెలిపారు. బాధిత కుటుంబానికి కుటుంబానికి రూ.25 లక్షలు, ఐదెకరాల భూమి నష్టపరిహారంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసు శాఖ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి కోట శ్రీనివాస్, ముంజం ఆనంద్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యుడు నేర్పల్లి అశోక్ పాల్గొన్నారు.

మత్తుకు బానిస కావొద్దు



అవగాహన కల్పిస్తున్న అధికారులు

కౌటాల: విద్యార్థులు మత్తుకు బానిస కావద్దని ఎంఈవో గావుడే హన్మంతు అన్నారు. మాదకద్రవ్యాల వినియోగ నిరోధక దినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలోని గుండాయిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తుకు బానిసైతే అనారోగ్యం బారిన పడుతారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నానాజీ, పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.